దువ్వాడ స్టేషన్ మార్గం ఛిద్రం

- హడలిపోతున్న ప్రయాణికులు
- ద్విచక్ర వాహనచోదకుల ఫీట్లు


రాజీవ్‌నగర్ ఫేజ్–6 ఏలేరు కాలువ వద్ద గోతులు


కూర్మన్నపాలెం వందడుగుల రహదారి మలుపులో ప్రమాదకరంగా మారిన గోతులు

అగనంపూడి: జాతీయ రహదారి కూర్మన్నపాలెం కూడలి నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే వందడుగుల రహదారి ఛిద్రం కావడంతో ప్రయాణికులు హడలిపోతున్నారు. మూడు మాసాల నుంచి రాజీవ్‌నగర్ ఫేజ్–6 ఎదురుగా ఏలేరు కాలువ వద్ద రోడ్డు లోతట్టులో ఉండడంతో, చిన్నపాటి వర్షాలకు నీరు నిల్వ ఉండిపోయి గోతులమయంగా మారింది. ఈ మార్గంలో ఒకటి రెండు చోట్ల మాత్రమే మరమ్మతులకు గురికాగా, నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలకు పలుచోట్ల రహదారి ధ్వంసమైంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో పలుచోట్ల రోడ్డు కోతకు గురవ్వడం, ధ్వంసం కావడంతో వాహనచోదకులు హడలిపోతున్నారు.

- వుడా ఫేజ్–6కు ఆరంభంలో ఏలేరు కాలువ వద్ద రోడ్డు రెండున్నర–మూడడుగుల లోతులో గొయ్యి ఏర్పడడంతో వాహనచోదకులు పాట్లు పడుతున్నారు. ఈ మార్గంలో మొదటి సారి ప్రయాణం చేసే ప్రయాణికులు గోతిలో పడి గాయాలపాలవుతున్నారు.


శాతవాహన నగర్‌కు వెళ్లే మార్గంలో ధ్వంసమైన రహదారి

- అప్పికొండ ఎస్సీ కాలనీ–వడ్లపూడి ప్రధాన రహదారి అనుసంధాన మార్గం మలుపులో రోడ్డు ధ్వంసమైంది. ఈ కూడలి నిత్యం రద్దీగా ఉండడంతో దువ్వాడ కూర్మన్నపాలెం వైపు వెళ్లే వాహనాలు ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుంటున్నాయి. ఇక్కడ ఎక్కువ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మినరల్ వాటర్‌ప్లాంట్‌తో పాటు ప్రధాన వాణిజ్య కూడలి కావడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.
- ఉక్కు కో–ఆపరేటివ్ స్టోర్ ఎదురుగా శాతవాహన నగర్‌కు వెళ్లే మార్గం మలుపు వద్ద కూడా రోడ్డు పాడైంది. దీంతో ఇక్కడ కూడా వాహనాల రాకపోకలకు కొద్దిపాటి అంతరాయం కలుగుతోంది. ఉదయం ఏడు గంటల నుంచి పది వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ రహదారి రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో పది వరకు ప్రైవేటు ఆస్పత్రులు, హోటళ్లు, షాపింగ్‌మాల్స్, రోడ్డు పక్కన తోపుడు బళ్ల వ్యాపారాలు, కూరగాయల వ్యాపారాలు సాగుతున్నాయి. ఈ క్రమంలో రహదారి పలుచోట్ల మరమ్మతులకు గురవ్వడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుంది. దువ్వాడ రైల్వేస్టేషన్, దువ్వాడ వీఎస్ఈజెడ్, విజ్ఞాన్ యూనివర్సిటీ, సబ్బవరం మండల గ్రామాలకు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. జీవీఎంసీ, వుడా అధికారులు స్పందించి తక్షణం రహదారి విస్తరణ పనులు పూర్తి చేసి, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారి నిర్మించాలి



రహదారి విస్తరణలో అసంపూర్తి పనుల వల్ల ఇబ్బంది పడుతున్నాం. దానికి తోడు వర్షాలకు రహదారి పలుచోట్ల ధ్వంసం కావడం మరింత ప్రమాదకరంగా మారింది. వుడా ఫేజ్–6 వద్ద నూతిలాంటి గొయ్యి ఏర్పడడంతో వాహనచోదకులు ఫీట్లు చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలి.

– కంచుమూర్తి ఈశ్వర్, వుడా ఫేజ్–1

ఎక్కడికక్కడే గోతులు



నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ఎక్కడికక్కడే గోతులు ఏర్పడడంతో వాహనచోదకులకు అవస్థలు తప్పడం లేదు. వుడా రహదారి విస్తరణ పేరుతో పనులు సాగుతున్నాయి. వీటికి తోడు రహదారి ధ్వంసం కావడంతో వీఎస్ఈజెడ్ ఉద్యోగులు, దువ్వాడ రైల్వే ప్రయాణికులు, విద్యార్థులకు చాలా ఇబ్బందవుతోంది. పాలకులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– కాటం చంద్రరావు, రాజీవ్‌నగర్

ప్రశాంత జీవనమే ప్రజాపిత బాబాజీ ఆశయం


బ్రహ్మకుమారీలు, అతిథులను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు

అగనంపూడి: లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ ఓంశాంతి బ్రహ్మకుమారీస్ వ్యవస్థాపకులు ప్రజాపిత బాబాజీ తన యావదాస్తిని దానం చేసి 140 దేశాల్లో శాఖోపశాఖలుగా విస్తరింపజేశారని ముంబయికి చెందిన రాజయోగి బీకే గణేష్ అన్నారు. బ్రహ్మకుమారీస్ అగనంపూడి శాఖ (దివ్యజ్యోతి భవనం) 11వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ జాతి మానసిక పరివర్తనతో ప్రశాంత జీవనం సాగించాలనే సత్సంకల్పంతో ప్రపంచ నలుదిశలా శాఖలు ఏర్పాటు చేశారన్నారు. అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) మాట్లాడుతూ బ్రహ్మకుమారీలు చేపడుతున్న ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. విశాఖ జిల్లా కో–ఆర్డినేటర్ రాజయోగి బీకే సోమేశ్వరి, అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి మాట్లాడారు. ఈ సందర్భంగా సంస్థ ప్రారంభం నుంచి సేవలు అందిస్తున్న 30 మంది బ్రహ్మకుమారీలను సత్కరించారు. కార్యక్రమంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, రిటైర్డ్ హెచ్ఎం బొండా అప్పారావు మాస్టారు, అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి, నాయకులు, వివిధ శాఖల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

27 నుంచి ఐసీహెచ్ క్యాంటీన్ల మూత


ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వెనుక కెఫెటేరియా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఇండియన్ కాఫీ హౌస్ (ఐసీహెచ్) క్యాంటీన్లు ఈ నెల 27 నుంచి మూత పడనున్నాయి. ఈ మేరకు వారు ఉక్కు వెల్ఫేర్ విభాగానికి లేఖ అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో యాజమాన్యం ఆధ్వర్యంలో క్యాంటీన్లు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వెనుక ఉన్న కెఫెటేరియాతో పాటు కొన్ని విభాగాల్లో మరో నాలుగు నడుస్తున్నాయి. అయితే కొన్ని నెలలుగా మొత్తం ఐదు క్యాంటీన్లకు సుమారు రూ.3 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వారు కొంతకాలంగా బిల్లుల కోసం యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో ఈ నెల 26 వరకు మాత్రమే తమ క్యాంటీన్లు కొనసాగుతాయన్నారు. 27 నుంచి క్యాంటీన్లు మూసి వేయనున్నామని ఐసీహెచ్ ప్రతినిధి తెలిపారు.

కిమ్స్ ఐకాన్‌లో వృద్ధురాలికి అరుదైన చికిత్స


కోలుకున్న వృద్ధురాలితో డాక్టర్ వెంకటేష్ పోతుల

అక్కిరెడ్డిపాలెం(గాజువాక): షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో ఓ వృద్ధురాలికి అరుదైన చికిత్స అందించారు వైద్యులు. మెదడులో రక్తనాళాల్లో ఎన్యూరిజం పగలడం, కారోటికో–కావెర్నస్ ఫిస్టులా (సీసీఎఫ్)తో పాటు రక్తనాళాల్లో పూడికలు ఏర్పడటంతో ఒకే సెషన్‌లో చికిత్స నిర్వహించి నయం చేశారు. దీనికి సంబంధించి ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్ పోతుల బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నానికి చెందిన 66 ఏళ్ల వృద్ధురాలు తీవ్రమైన తలనొప్పి, ఎడమ కంటి కనుపాపలు వాలిపడిపోతుండటం, స్పృహ కోల్పోవడం, వాంతుల వంటి సమస్యలతో ఆస్పత్రిలో చేరారన్నారు. ఎంఆర్ఐ స్కాన్‌లో మెదడు రక్తనాళాల్లో ఎన్యూరిజం పగిలిపోయినట్లు తేలిందని చెప్పారు. ఆస్పత్రిలో చేరిన వెంటనే ఆమెకు స్ట్రోక్ రావడంతో కుడి కాలు కదపలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం కొన్ని పరీక్షలు, యాంజియోగ్రామ్ చేసిన తర్వాత మెదడు రక్తనాళాల్లో పూడికలను గుర్తించామన్నారు. డాక్టర్ వెంకటేష్ పోతుల వైద్యబృందం రక్తనాళం పూడికకు మెకానికల్ థ్రాంబెక్టమీ, పగిలిపోయిన ఎన్యూరిజంకు ఫ్లో డైవర్టర్ ప్లేస్‌మెంట్ ఒకేసారి నిర్వహించారు. పగిలిపోయిన ఎన్యూరిజం, రక్తనాళాల్లో పూడిక రెండింటికీ ఒకేసారి చికిత్స నిర్వహించారు. ఈ సమగ్ర విధానం వల్ల మొత్తం మూడు సమస్యలు ఒకేసారి పరిష్కారం అయ్యాయన్నారు. చికిత్సలు విజయవంతం కావడంతో రోగి ఎలాంటి సమస్యలు లేకుండా తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నారని డాక్టర్ వెంకటేష్ తెలియజేశారు.

క్లుప్తంగా

ఘనంగా పత్రీజీ ఆరాధనోత్సవాలు


సామూహిక ధ్యానం చేస్తున్న సభ్యులు

పెదగంట్యాడ: పిరమిడ్ ధ్యాన కేంద్రాల వ్యవస్థాపకుడు బ్రహ్మర్షి పత్రీజీ ద్వితీయ ఆరాధనోత్సవాలను పిరమిడ్ అహింసా ధ్యాన కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక ధ్యానం నిర్వహించారు. పత్రీజీ పిరమిడ్ స్పిరిట్యుచువల్ ట్రస్ట్ కార్యదర్శి మీసాల శివ గణేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. యోగా, ధ్యాన సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. అనంతరం పిరమిడ్ సొసైటీ ఆదర్శ సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో ధ్యాన కేంద్రం సభ్యులు వనిత, మంజు, జయమ్మ, ధనలక్ష్మి, శ్యామల, విష్ణు కుమార్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే తప్పనిసరి


బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు

అగనంపూడి: కరాటే ఆత్మరక్షణ విద్య అని షీల్డ్ ఫోర్స్ కరాటే అకాడమీ డైరెక్టర్ బాబీ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు, మహిళలు ఈ విద్యను తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వందమంది విద్యార్థులకు బెల్ట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.సత్యనారాయణ, కె.మహేష్, జి.రాము నాయుడు, వి.నిఖిల్, కేశవ్ సురేందర్, శారద తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


కమిషనర్‌కు మొక్క అందిస్తున్న కార్పొరేటర్ అనూష, లతీష్ దంపతులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సంపత్ కుమార్‌ను 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషనర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి, శాలువాతో సత్కరించారు. మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

గ్రంథాలయ పితామహుడికి ఘన నివాళి


అయ్యంకి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి రమణ

పెదగంట్యాడ: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య సేవలు మరువలేమని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠకులు రాంబాబు, హరిప్రసాద్, రాకేష్, పురుషోత్తం, దేవి, నవ్య తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో 'ఉక్కు'కు తీరని అన్యాయం

- కూటమిలో ఉన్నా రాష్ట్రానికి బీజేపీ మొండి చెయ్యి
- టీడీపీ, జనసేన మేల్కొని స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలి
- సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు


మాట్లాడుతున్న సిటూ నాయకుడు నరసింగరావు

అగనంపూడి: కేంద్ర బడ్జెట్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు తీరని అన్యాయం చేసిందని సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 1259వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న నరసింగరావు మాట్లాడుతూ కూటమిలో ఉన్నప్పటికీ బీజేపీ ఏమాత్రం సాయం చేయకుండా విశాఖ ఉక్కుకు, రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తి సామర్థ్యంతో కర్మాగారం నడిచేలా బడ్జెట్ సహకారం అందివ్వాలని, ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేయడం ద్వారా ఆదాయాన్ని రాబట్టాలనే కుట్రలను కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ భాగస్వామ్య పక్షాలుగా ఉన్న టీడీపీ, జనసేన ఈ విషయంలో మేల్కొని విశాఖ ఉక్కు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని ప్రకటించే వరకు ఉద్యమాలు ఆపేది లేదన్నారు. కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా కార్మికులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వం పద్ధతి మార్చుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్టీల్ సిటూ అధ్యక్షుడు వై.టి.దాస్, నాయకులు ఎన్.రామారావు, ప్రతినిధులు శ్రీనివాసరాజు, యు.వెంకటేశ్వర్లు, గంగాధర్, నీలకంఠం, టివికె రాజు, సంతోష్, శివ, పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ జీఎం సంజీవరావుకు సత్కారం


స్టీల్‌ప్లాంట్ జీఎం సంజీవరావును సత్కరిస్తున్న ఐఎస్‌టీడీ కార్యవర్గం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) కె.సంజీవరావును ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌టీడీ) కార్యవర్గం సత్కరించింది. ఈ నెలాఖరున సంజీవరావు పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఉక్కు ప్రధాన పరిపాలన భవనంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐఎస్‌టీడీ చైర్మన్ డాక్టర్ ఓ.ఆర్.ఎం.రావు నేతృత్వంలో కార్యవర్గ సభ్యులు సంజీవరావును సత్కరించి, మొమెంటో అందజేశారు. కార్యక్రమంలో సీసీ విభాగం ఇన్‌చార్జి ఆర్.పి.శర్మ, వెల్ఫేర్ విభాగం జీఎం ఎం.ఎం.రావు, సీఎండీ కార్యాలయం డీజీఎం జె.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

జాషువా రచనలు అజరామరం


జాషువా వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఉక్కునగరం: మధురకవి, నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా రచనలు అజరామరమని ఉక్కునగరం జాషువా కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. జాషువా వర్ధంతి సందర్భంగా సెక్టర్–3 గుర్రం జాషువా పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు జాషువా విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సాహితీ చరిత్రలో జాషువాది ప్రత్యేక అధ్యాయమన్నారు. ఆయన రచనలను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చుట్టుగుల్ల సుదర్శనం అధ్యక్షత వహించిన కార్యక్రమంలో నాయకులు డి.సంపూర్ణం, ఉప్పలపాటి దానమయ్య, ఎ.సురేష్, కె.సుబ్బారావు, కె.రాజబాబు, మార్పుపూడి పరదేశి, పిట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ నిర్ణేతలు, కోచ్‌లకు ప్రశంసలు


ప్రశంసలు అందుకున్న విశాఖ కోచ్‌లు

అగనంపూడి: భూటాన్‌లో ఈ నెల 15 నుంచి 22 వరకు నిర్వహించిన 8వ సౌత్ ఏషియన్ కరాటే చాంపియన్‌షిప్ రిఫరీ సెమినార్‌లో పాల్గొన్న విశాఖకు చెందిన ఐదుగురు కోచ్‌లు, న్యాయ నిర్ణేతలు ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు. ఉత్తమ కోచ్‌లు, న్యాయ నిర్ణేతలుగా దక్షిణాసియా విభాగం అధ్యక్షుడు భరత్‌శర్మ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. రిఫరీలుగా వ్యవహరించిన విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.ఎ.రాజు కోరాడ సుమన్, ఇ.ఎన్.డి.ప్రవీణ్, కె.ప్రసాద్‌కుమార్, బి.మురళీ కృష్ణలకు ప్రశంసా పత్రాలతో పాటు ఏషియన్ కరాటే ఫెడరేషన్ న్యాయ నిర్ణేతలుగా నియమించినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కె.మిల్టన్ శాస్త్రి, ప్రధాన కార్యదర్శి కొండ్రు కీర్తన్ వారిని అభినందించారు.

వైభవంగా నృసింహుని నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం బుధవారం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ షీలానగర్ ఫీడర్‌లో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా షీలానగర్, గవరజగ్గయ్యపాలెం, షీలానగర్ వాటర్ వర్క్స్, రాంకీ హెచ్‌టీ సర్వీస్, డెయిరీ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సంప్రదాయ క్రీడలపై అవగాహన అవసరం

- అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ
- లంకెలపాలెం హైస్కూల్లో క్రీడాపోటీలు ప్రారంభం


లంకెలపాలెం హైస్కూల్లో క్రీడలను ప్రారంభిస్తున్న అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ



కణితి హైస్కూల్‌లో క్రీడోత్సవాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

అగనంపూడి: భారతదేశంలో మరుగున పడిపోయిన సంప్రదాయ క్రీడల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశంలో పుట్టిన ఖోఖో, కబడ్డీ, తొక్కుడు బిళ్ల, వంటి ఆటల వల్ల వినోదం, వ్యాయామం ఉండేదన్నారు. విద్యార్థులు పలు క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తరువాత పిరమిడ్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి మురళీమోహన్ పట్నాయక్, పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, డీఈవో ఆఫీస్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- పెదముషిడివాడ హైస్కూల్లో క్రీడా పోటీలను హెచ్ఎం కృష్ణ ప్రారంభించారు. క్రీడల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్లో క్రీడా పోటీలను హెచ్ఎం కనకేశ్వరరావు ప్రారంభించారు. విద్యార్థులు ఖోఖో, మ్యూజికల్ చైర్, గోలీకాయలు, ఏడు పెంకులాట, ఒంగుడు గెంతులు ఆటల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు సంప్రదాయ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని విద్యార్థులతో పోటాపోటీగా ఆడారు.


అక్కిరెడ్డిపాలెం హైస్కూల్లో విద్యార్థులతో క్యారమ్స్ ఆడుతున్న ఎంఈవో సునీత

అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్లో..

అక్కిరెడ్డిపాలెం: శిక్షా సప్తాహ్ కార్యక్రమాల్లో భాగంగా అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన ఆటల పోటీలను గాజువాక ఎంఈవో సునీత పరిశీలించారు. విద్యార్థులతో కలిసి చెస్, క్యారంబోర్డ్ ఆడి, వారిని ఉత్సాహపరిచారు. మ్యూజికల్ చైర్, షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలను పరిశీలించారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించినట్లు పాఠశాల పీడీ ఇస్మాయిల్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కణితి హైస్కూల్లో..

అగనంపూడి: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా 87వ వార్డు కణితి హైస్కూల్లో వివిధ స్వదేశీ క్రీడల పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు ఈ ఆటలు కొత్తగా ఉండడంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.మన్నాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


లంకెలపాలెం హైస్కూల్లో విద్యార్థుల పిరమిడ్ విన్యాసం


వాడచీపురుపల్లి హైస్కూల్‌లో క్రీడా పోటీల కోలాహలం


కణితి హైస్కూల్‌లో చదరంగం ఆడుతున్న బాలలు

బాబూరావు సేవలు ఎనలేనివి


ఉరుకూటి బాబూరావును సన్మానిస్తున్న సేవా సంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, భెల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు సేవలు ఎనలేనివని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్య నిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు అన్నారు. బాబూరావు ఉద్యోగ విరమణ సందర్భంగా సంస్థలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నెహ్రూ యువజన సేవా సంఘం ప్రతినిధులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ జిల్లా నుంచి మొట్ట మొదటిసారి జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించిన ఘనత బాబూరావుకు చెందుతుందన్నారు. ఆయన శిక్షణలో ఎంతోమంది క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు హాజరయ్యారని, మరెంతోమంది స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ కబడ్డీ క్రీడాకారులు ఉరుకూటి కనకరాజు, నీలకంఠం, ఉరుకూటి రాజు, పీవీ రమణ, మదీసి రాము, మొల్లి శ్రీను, అనిల్ తదితరులు పాల్గొన్నారు.